ఆర్మీ, నేవీ చీఫ్‌లుగా క్లాస్‌మేట్స్!

- దేశ మిలిటరీ చరిత్రలో ఇదే తొలిసారి
- సైనిక్ స్కూల్‌లో కలిసి చదువుకున్న ఉపేంద్ర ద్వివేది, దినేశ్ త్రిపాఠి

న్యూఢిల్లీ: దేశ మిలిటరీ చరిత్రలో తొలిసారిగా ఇద్దరు క్లాస్‌మేట్స్ ఆర్మీ, నేవీ అధిపతులు అయ్యారు. ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి 1970లో మధ్యప్రదేశ్‌లోని రేవాలో గల సైనిక్ స్కూల్లో కలిసి చదువుకున్నారు. రక్షణ శాఖ మంత్రి అధికార ప్రతినిధి భరత్ భూషణ్ ఈ విషయాన్ని ఎక్స్‌లో షేర్ చేశారు. '50 ఏండ్ల తర్వాత తాము పనిచేసే సర్వీసులను ముందుండి నడిపించే ఇద్దరు అద్భుతమైన విద్యార్థులను అందించిన అరుదైన గౌరవం రేవా సైనిక్ స్కూల్‌కు దక్కుతుంది' అని ఆయన పేర్కొన్నారు. ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్‌గా ఉపేంద్ర ద్వివేది ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

7న క్లాట్ నోటిఫికేషన్

డిసెంబర్ 1న పరీక్ష

న్యూఢిల్లీ, జూన్ 30: జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల కన్సార్టియం(ఎన్ఎల్‌యూ) 2025 సంవత్సరానికి గాను కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) నోటిఫికేషన్‌ను ఈ నెల 7న విడుదల చేయనుంది. ఈ ఏడాది డిసెంబర్ 1న అడ్మిషన్ టెస్ట్ నిర్వహించనుంది. 22 జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాలు, ఇతర సంబంధిత న్యాయ విద్యా సంస్థలు అందిస్తున్న యూజీ, పీజీ కోర్సుల్లో సీట్లు పొందాలనుకొనే విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో క్లాట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్ఎల్‌యూ వెబ్‌సైట్ పేర్కొంది.

ఆన్‌లైన్ మాధ్యమంలో నీట్ యూజీ!

- కేంద్రప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహణలో మార్పులు చేయాలని కేంద్రం భావిస్తున్నది. వచ్చే ఏడాది నుంచి నీట్-యూజీ పరీక్షను పెన్ అండ్ పేపర్ పద్ధతిలో కాకుండా, ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నదని అధికార వర్గాలు తాజాగా వెల్లడించాయి. కాగా, నీట్-పీజీ పరీక్ష తేదీలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ రీషెడ్యూల్ చేయనున్నది. ఒకటి రెండు రోజుల్లో పరీక్షకు సంబంధించి కొత్త తేదీలను ప్రకటించనున్నది.

ఏడాదిలో రెండుసార్లు నిర్వహించలేం!

వార్షిక పరీక్షలపై కేంద్రానికి తెలిపిన సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: ప్రస్తుత అకడమిక్ షెడ్యూల్ ప్రకారం 10, 12 తరగతులకు ఒక ఏడాదిలో రెండుసార్లు వార్షిక బోర్డు పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని సీబీఎస్ఈ కేంద్ర విద్యాశాఖకు స్పష్టం చేసింది. జూన్ 25న ఢిల్లీలో జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్-2023పై జరిగిన సీబీఎస్ఈ, విద్యాశాఖ అధికారుల సమావేశంలో ఈ విషయాన్ని విద్యాశాఖకు వెల్లడించామని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక సీబీఎస్ఈ అధికారి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ స్కూళ్లలో బోర్డు పరీక్షలు నిర్వహించాలంటే 4 వేల ప్రశ్నాపత్రాలు, 20 వేల ప్రశ్నలు రూపొందించాలని... 2.5 కోట్ల సమాధానపత్రాలను దిద్దాలని ఆయన చెప్పారు. కొత్త జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యార్థులపై భారం తగ్గించడానికి వీలైతే 2025-26 విద్యా సంవత్సరం లేదా ఆ తర్వాత ఏటా రెండు సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ ఈ ఏడాది ఫిబ్రవరిలో సీబీఎస్ఈకి ప్రతిపాదించింది.

కొత్త న్యాయ చట్టాలు నేటి నుంచే

ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో అమల్లోకి

- జీరో ఎఫ్ఐఆర్.. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు
- ఎలక్ట్రానిక్ మాధ్యమంలో సమన్లు
- హేయమైన నేరాల క్రైమ్ సీన్లకు వీడియోగ్రఫీ తప్పనిసరి
- విచారణలో జాప్యం నివారణకు రెండు వాయిదాలకే చాన్స్
- విచారణ పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా తీర్పు
- కొత్త చట్టాల్లో కీలక నిబంధనలు

న్యూఢిల్లీ, జూన్ 30: బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలుకుతూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1(సోమవారం) నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్) అమల్లోకి వస్తాయి. భారతదేశ నేర న్యాయ వ్యవస్థ, నేరాల దర్యాప్తు, విచారణ ప్రక్రియలో ఈ కొత్త చట్టాలు వేగం తీసుకురానున్నాయని, ఒక ఆధునిక న్యాయ వ్యవస్థను అందించనున్నాయని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కొత్త చట్టాల్లో జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎంఎస్ఎం వంటి ఎలక్ట్రానిక్ మోడ్ విధానంలో సమన్లు జారీ, అతి క్రూరమైన నేరాల క్రైమ్ సీన్‌లను వీడియోగ్రఫీ చేయడం వంటి నిబంధనలు ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాల మాదిరిగా కాకుండా కొత్త చట్టాలు ప్రజలకు న్యాయం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గతంలో చెప్పారు.

కొత్త చట్టాల్లోని కీలక నిబంధనలు ఇవే..

- మైనర్‌పై సామూహిక లైంగిక దాడికి పాల్పడితే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన. పిల్లలను అమ్మడం లేదా కొనడం క్రూరమైన నేరం.
- జీరో ఎఫ్ఐఆర్ విధానంతో ఒక వ్యక్తి పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా ఏదైనా ఘటనను రిపోర్టు చేయడంలో లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించడంలో ఆలస్యాన్ని నివారించొచ్చు.
- ఏదైనా ఘటనను ఒక వ్యక్తి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు వీలుంది. పోలీసుస్టేషన్‌కు వ్యక్తిగతంగా వెళ్లాల్సిన అవసరం లేదు. దీని ద్వారా వేగవంతమైన ఫిర్యాదు ద్వారా అదే వేగంతో పోలీసులు తగిన చర్యలు తీసుకొనే వెసులుబాటు ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ రూపంలో సమన్లు జారీ చేయవచ్చు. దీని ద్వారా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పేపర్ వర్క్‌ను తగ్గిస్తుంది.
- లైంగిక దాడి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆమె సంరక్షకురాలు లేదా బంధువు సమక్షంలోనే ఒక మహిళా పోలీసు అధికారి రికార్డు చేయాలి. వారం రోజుల్లోగా వైద్య నివేదిక రావాలి.
- మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి.. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి.
- ఏదైనా కేసులో నిందితులు, బాధితులు 14 రోజుల్లోగా ఎఫ్ఐఆర్, పోలీసు రిపోర్టు, చార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్ల కాపీలను పొందవచ్చు.
- క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా తీర్పు ఇవ్వాలి. విచారణ ప్రారంభమైన 60 రోజుల్లోగా అభియోగాలు నమోదు చేయాలి.
- కేసు విచారణలో అనవసర జాప్యాలను నివారించేందుకు, సకాలంలో న్యాయం అందించేందుకు న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.
- సాక్షుల భద్రతను, వారి సమాచారాన్ని దృష్టిలో ఉంచుకొని సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి.
- రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే పదాన్ని చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యలను నిర్వచించారు. ఏదైనా కేసులో చేపట్టే తనిఖీలు, స్వాధీనాలను వీడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి.
- వివాహం పేరుతో మోసం చేయడం, మైనర్లపై సామూహిక లైంగిక దాడికి పాల్పడటం, మూక హత్యలు, చైన్ దొంగతనాలు వంటి ఘటనలకు పరిష్కరించేందుకు ప్రత్యేక నిబంధనలు.
- అరెస్టు సందర్భాల్లో బాధితులు తమ పరిస్థితి గురించి సమాచారాన్ని బంధువులకు లేదా స్నేహితులకు తెలియజేసే హక్కు ఉంటుంది. తద్వారా అరెస్టయిన వ్యక్తి తక్షణ సాయం పొందే వీలుంటుంది.
- అరెస్టు వివరాలను ప్రముఖంగా పోలీసు స్టేషన్లు, జిల్లా కేంద్రాల్లో డిస్‌ప్లే చేయాలి. దీని ద్వారా అరెస్టయిన వ్యక్తి బంధువులు, స్నేహితులు ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చు.
- దర్యాప్తును బలోపేతం చేయడంలో భాగంగా తీవ్రమైన నేరాల విషయంలో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా ఘటనాస్థలికి వెళ్లి ఆధారాలు సేకరించాలి.
- మహిళలపై నేరాల కేసుల్లో బాధితులు తమ కేసు పురోగతిపై 90 రోజుల్లోపు ఎప్పటికప్పుడు సమాచారం పొందేందుకు అర్హులు.
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో బాధితులకు అన్ని దవాఖానల్లో ఉచితంగా ప్రథమ చికిత్స లేదా వైద్య చికిత్స.
- మరింత భద్రత కల్పించడం, దర్యాప్తులో పారదర్శకతను అమలు చేయడంలో భాగంగా లైంగిక దాడి కేసుల్లో బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.
- మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, 15 ఏండ్లలోపు పిల్లలు, 60 ఏండ్ల పైబడిన వృద్ధులు పోలీసుస్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు నివాసం ఉంటున్న చోటే పోలీసుల సాయం పొందొచ్చు.

నీట్ కేసులో గుజరాత్ ప్రైవేట్ స్కూల్ యజమాని అరెస్ట్

గోద్రా: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలకు సంబంధించిన కేసులో గుజరాత్‌లోని గోద్రాలో ఓ ప్రైవేట్ స్కూల్ యజమానిని సీబీఐ ఆదివారం అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఆరుగురు అరెస్టయ్యారు. మే 5న జరిగిన నీట్-యూజీ పరీక్ష నిర్వహణకు ఎంపిక చేసిన కేంద్రాల్లో జై జలరామ్ స్కూల్ ఒకటి. ఇది పంచమహల్ జిల్లాలోని గోద్రా సమీపంలో ఉంది. దీని యజమాని దీక్షిత్ పటేల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆయన ఈ పరీక్షలో పాస్ చేయించడానికి సుమారు 27 మంది అభ్యర్థుల నుంచి రూ.10 లక్షలు చొప్పున డిమాండ్ చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ నిందితులకు లంచాలు ఇచ్చిన అభ్యర్థుల స్టేట్‌మెంట్లను గత వారం రికార్డు చేశారు.

అస్సాంలో 'క్యాష్ ఫర్ మార్క్స్' స్కామ్

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత అస్సాంలో 'మార్కుల కోసం నగదు' కుంభకోణం బయటపడింది. మార్కుల జాబితాలను డిజిటల్ ట్యాంపరింగ్ చేస్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. అజీజుల్ హక్ అనే విద్యార్థి మార్కుల జాబితాలో పొంతనలేని మార్కులపై గణేశ్ లాల్ చౌదరి కళాశాల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విద్యార్థి వాస్తవంగా పొందిన మార్కుల కన్నా మార్కుల జాబితాలో ఉన్న మార్కులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. దీనిపై సీఐడీ దర్యాప్తు జరుపుతున్నది. మరికొందరు అరెస్టయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. పోలీసులు ప్రశ్నించినపుడు ఈ విద్యార్థి నేరాన్ని అంగీకరించాడు.

ఎయిర్‌పోర్టుల్లో నాసిరకం నిర్మాణాలు!

- రాజధాని ఢిల్లీలో కూలిన ఎయిర్‌పోర్టు పైకప్పు
- లక్నో విమానాశ్రయంలో లీకేజీ
- మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ పలు ఘటనలు
- మోదీ ప్రభుత్వ అవినీతి వల్లే
- కేంద్రంపై విపక్ష పార్టీల ధ్వజం



లక్నో ఎయిర్‌పోర్టులో నీళ్ల లీకేజీ

తాజాగా ఉత్తరప్రదేశ్‌లో అదానీ గ్రూపు నిర్వహిస్తున్న లక్నో ఎయిర్‌పోర్టు టెర్మినల్-3 పైకప్పు నుంచి నీళ్లు లీకేజీ అవుతున్న వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ కొత్త టెర్మినల్‌ను కూడా మూడు నెలల క్రితమే ప్రారంభించారు. నీళ్ల లీకేజీ ఘటనపై ప్రయాణికులు భయాందోళన, తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ' ఒక అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు నుంచి నీరు కారడం మంచి సంకేతం కాదు. ఇది నాసిరకపు పనిని ప్రతిబింబిస్తుంది' అని శరద్ కుమార్ అనే వ్యక్తి పేర్కొన్నారు.

న్యూఢిల్లీ, జూన్ 30: దేశంలోని విమానాశ్రయాల్లో నాసిరకం నిర్మాణాలపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇటీవల చోటుచేసుకున్న వరుస ప్రమాద ఘటనలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగు రోజుల వ్యవధిలో దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టుతో సహా బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, గుజరాత్‌లోని రాజ్‌కోట్, యూపీలోని లక్నో విమాశ్రయాల్లో పైకప్పులు కూలడం, వర్షాలకు నీళ్ల లీకేజీ వంటి ఘటనలు జరిగాయి. కేంద్రంలో పదేండ్ల మోదీ ప్రభుత్వ అవినీతి, నిర్లక్ష్యం వల్లే నాసిరకంగా మౌలిక సదుపాయాలు కూలిపోతున్నాయని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

కీలకమైన ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే..

ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత శుక్రవారం టెర్మినల్-1 వద్ద పైకప్పు కుప్పకూలింది. ఈ ప్రమాదంలో క్యాబ్ డ్రైవర్ మరణించగా, మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. విమానాశ్రయంలో ప్రయాణికుల సామర్థ్యాన్ని పెంచే టెర్మినల్ ఆధునీకరణను ప్రధాని మోదీ ప్రారంభించిన నాలుగు నెలల్లోపే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

3 నెలల క్రితమే ప్రారంభం

ప్రధాని మోదీ మూడు నెలల క్రితం ప్రారంభించిన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ఎయిర్‌పోర్టులోనూ గత గురువారం ఇదే విధంగా పైకప్పు కూలి ఓ కారుపై పడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు.

రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టులో కూలిన కెనోపీ

శనివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టు టెర్మినల్ బయట వాహనాలు ఆగే చోట ఏర్పాటు చేసిన కెనోపీ భారీ వర్షాలకు కుప్పకూలింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ గత ఏడాది జూలైలో ప్రారంభించారు.

బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఆదివారం ఓ వాటర్ ట్యాంక్ కుప్పకూలి ఇద్దరు చనిపోయారు. మరో 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. 'జల్ నిగమ్' పథకం కింద రూ.6 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ ట్యాంక్ కేవలం 3 ఏండ్లలో కుప్పకూలటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది.

ఇది బీజేపీ పాలిత గుజరాత్‌లోని రోడ్ల పరిస్థితి. స్మార్ట్ సిటీ అహ్మదాబాద్‌లో ఓ ప్రధాన రహదారిపై భారీ గొయ్యి ఏర్పడింది. ఆ గుంతలో ఎవరూ పడకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు రాజధాని గాంధీనగర్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు ఓ రోడ్డు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. అందులో అటుగా వస్తున్న కారు ఇరుక్కుపోయింది. 'అహ్మదాబాద్‌లో ఇటీవలే అండర్ గ్రౌండ్ వర్షపు నీటి వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీని కారణంగా ఒక్క చుక్క నీరు కూడా అరేబియా సముద్రంలో కలవదు' అని కాంగ్రెస్ దీనిపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది.

ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులతో శరీరంలోకి మైక్రోప్లాస్టిక్

న్యూఢిల్లీ, జూన్ 30: ప్లాస్టిక్ చాపింగ్ బోర్డ్‌పై కూరగాయలు, పండ్లు కోయటం ద్వారా కడుపులోకి మైక్రోప్లాస్టిక్ (5 మిల్లీ మీటర్ల పొడువు కన్నా తక్కువ) చేరుతుందని తాజా అధ్యయనంలో తేలింది. దీని వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పరిశోధకులు గుర్తించారు. ఒక ఏడాదిపాటు ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులను వంట గదుల్లో వాడినట్టయితే, దాని నుంచి 10 క్రెడిట్ కార్డులకు సమానమైన ప్లాస్టిక్ ఆహార పదార్థాల్లో కలుస్తుంది. ఆ తర్వాత వాటిని తిన్నవాళ్ల కడుపులో చేరుతుందని పరిశోధకులు గుర్తించారు. అంతే కాదు ప్రమాదకర బ్యాక్టీరియా కడుపులోకి చేరి...అక్కడుండే మంచి బ్యాక్టీరియాను దెబ్బతీస్తుందట. ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులకు బదులు వెదురు కర్రలు, పాలరాయి, చెక్కతో చేసినవి వాడటం శ్రేయస్కరమని అధ్యయనం సూచించింది.

పానీపూరీలో క్యాన్సర్ కారకాలు!

- సాస్, స్వీట్ చిల్లీ పొడర్లలో కృత్రిమ రంగులు
- కర్ణాటకలో పలు చోట్ల గుర్తింపు

బెంగళూరు: పానీపూరీ తింటున్నారా? అయితే మరోసారి ఆలోచించండి. పానీపూరీ తయారీలో వినియోగించే కృత్రిమ రంగుల్లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్టు తేలిందట. పలు రకాల ఆహారాల్లో కృత్రిమ రంగులు కలుపుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న క్రమంలో కర్ణాటకలో ఆహార భద్రత విభాగం అధికారులు రాజధాని బెంగళూరుతో సహా 79 చోట్ల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకర విషయాలు గుర్తించారు. చాలా పానీపూరీ నమూనాల్లో వాటి సాస్, స్వీట్ చిల్లీ పొడర్లలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్టు తేలిందని ది టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. చాలా వరకూ శాంపిళ్లలో సన్‌సెట్ యెల్లో, బ్రిలియంట్ బ్లూ, కార్మోసిన్ రంగులు ఉన్నట్టు తేలిందని సంబంధిత అధికారులు తెలిపారు. బెంగళూరులో సేకరించిన 49కి 19 శాంపిళ్లలో సింథటిక్ రంగులు ఉన్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో పానీ పూరీ తయారీలో కృత్రిమ రంగులతో తయారు చేసే సాస్‌లు, స్వీట్ చిల్లీ పొడర్లను రాష్ట్రవ్యాప్తంగా నిషేధించే యోచనలో అధికారులు ఉన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవల గోబీ మంచూరియా, కబాబ్‌ల వంటి ఆహార పదార్థాల తయారీలో కృత్రిమ రంగుల వాడకాన్ని నిషేధిస్తూ కర్ణాటక ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. కాగా, కృత్రిమ రంగుల వలన అలర్జీ, పిల్లల్లో హైపర్ యాక్టివిటీ, అరుగుదల వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని, ఇదే సమయంలో ఎక్కువ కాలం ఈ సింథటిక్ రంగులను తీసుకోవడం వలన క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం కూడా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అలాంటి 50 మంది ఎంపీలను ఎన్నుకోవాలి: రాజాసింగ్

ముంబై: హిందూ రాష్ట్రం కావాలని పార్లమెంట్‌లో నిర్భయంగా డిమాండ్ చేసే 50 మంది ఎంపీలను ఎన్నుకోవడం అత్యవసరమని తెలంగాణకు చెందిన బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ అన్నారు. హిందూ జనజాగృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం గోవాలో జరిగిన వైశ్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవ్‌లో ప్రసంగిస్తూ ప్రస్తుతం పలువురు రాజకీయ వేత్తలు హిందుత్వ వాదులుగా నటిస్తున్నారని, తీరా వారు ఎన్నికైన తర్వాత లౌకిక వాదులుగా మారిపోతున్నారని అన్నారు. ఇలాంటి వారి బుజ్జగింపు రాజకీయాల కారణంగా హిందూ భారత్ అచేతనం అయిపోతున్నదన్నారు. అయితే హిందూ రాష్ట్ర ఏర్పాటుకు అలాంటి ఎంఎల్ఏలు, ఎంపీలు ఎంత మాత్రం పనికి రారని అన్నారు. స్థిరంగా, దృఢంగా హిందుత్వ భావాలను వ్యక్తం చేయగల 50 మంది ఎంపీలను ఎన్నుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు.

బెంగాల్‌లో మహిళపై దాష్టీకం

- నడిరోడ్డుపై విచక్షణారహితంగా దాడి
- మమత సర్కార్‌పై ప్రతిపక్షాల ఆగ్రహం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో దారుణం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ ఓ జంటను కొంత మంది విచక్షణారహితంగా కొట్టారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు నడిరోడ్డుపై వారికి బహిరంగ శిక్ష విధించాడు. ఇద్దర్నీ రోడ్డుపై పడేసి చావబాదాడు. మహిళను జుట్టు పట్టుకొని కొట్టి, కిందపడేసి తన్నాడు. ఎంత వేడుకున్నా ఆ జంటను వదల్లేదు. ఈ అమానవీయ ఘటన ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా చోప్రా పట్టణంలో చోటుచేసుకుంది. జనం గుమికూడి చూస్తుండటం, దాడిని ఆపే ప్రయత్నం చేయకపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ఏం చేస్తున్నారు? రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అంటూ ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చోప్రా పట్టణంలో అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడే దాడికి తెగబడ్డాడని, స్థానికంగా తలెత్తే వివాదాల్లో తీర్పులు చెబుతూ.. నడిరోడ్డుపై శిక్షలు అమలుజేస్తున్నాడని బీజేపీ, సీపీఎం ఆరోపించాయి. నిందితుడు చోప్రా ఎమ్మెల్యే రెహమాన్ ముఖ్య అనుచరుడు తేజ్‌ముల్‌గా బీజేపీ ఐటీ విభాగం 'ఎక్స్'లో పేర్కొన్నది. మమత సర్కార్ పాలనలో 'బుల్డోజర్ జస్టిస్' అమలైందని సీపీఎం నాయకుడు ఎండీ సలీం అన్నారు. బెంగాల్‌లో సామాన్యులపై దాడులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దాడి ఘటనపై ఇస్లామ్‌పూర్ ఎస్పీ జాబీ థామస్ స్పందించారు. ఘటనకు బాధ్యులైన వారిని అరెస్టు చేయనున్నట్టు చెప్పారు. కాగా, దాడి ఘటనను తృణమూల్ ఖండించింది. నిందితుడు ఏ పార్టీకి చెందినా వదిలిపెట్టేది లేదని స్పష్టంచేసింది.

నీట ముంచిన గూగుల్ మ్యాప్స్

రోడ్డు అనుకుని నదిలోకి కారు

ఇద్దరిని రక్షించిన సిబ్బంది

కాసర్‌గఢ్: గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుని ప్రయాణం చేసిన ఇద్దరు యువకులు నదిలోకి కారును పోనిచ్చి చిక్కుకుపోయారు. అయితే అదృష్టవశాత్తు కారు చెట్టులో ఇరుక్కుపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అబ్దుల్ రషీద్, మరో యువకుడు కర్ణాటకలోని దవాఖానకు ఆదివారం తెల్లవారుజామున కేరళ నుంచి కారులో వెళ్తున్నారు. గూగుల్ మ్యాప్స్ సహాయంతో వెళ్తుండగా, నదిని రోడ్డు అనుకుని అందులోకి కారు డ్రైవ్ చేయడంతో కారు నీట మునిగి కొట్టుకుపోవడం ప్రారంభించింది. అయితే కారు ఒక చెట్టుకు చిక్కుకోవడంతో బతికిపోయారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తాడు సహాయంతో వీరిని రక్షించారు.

బీఎస్పీకి జాతీయ పార్టీ హోదా హుళక్కే!

న్యూఢిల్లీ, జూన్ 30: ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేపట్టిన పార్టీ.. దేశంలో ఒక వెలుగు వెలిగిన పార్టీ.. దళితుల పార్టీగా పేరుపొందిన మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) యూపీతో పాటు దేశంలో ఎక్కడా ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఓటింగ్ షేర్ కూడా 2.04 శాతానికి పడిపోయింది. దీంతో త్వరలో జాతీయ హోదా కోల్పోయే స్థితికి ఈ పార్టీ వచ్చింది. ప్రస్తుత్తం దేశంలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆప్, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)లకు జాతీయ పార్టీ హోదా ఉన్నది. కాగా, బీఎస్పీని 1984లో కాన్షీరాం స్థాపించగా.. 1997లో జాతీయ పార్టీగా గుర్తింపు పొందింది. బలమైన శక్తిగా ఎదిగిన బీఎస్పీ.. 2012 యూపీ అసెంబ్లీ ఎన్నికల నుంచి క్రమంగా ప్రభను కోల్పోయింది.

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ బరిలో 'అయోధ్య' ఎంపీ!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఉప సభాపతి ఎన్నికలు జరిగితే, ఇండియా కూటమి అభ్యర్థిగా సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్‌ను బరిలో నిలపాలని ఇండియా కూటమి యోచిస్తున్నది. ఆయన ఉత్తర ప్రదేశ్‌లోని ఫైజాబాద్